ఇదీ జీవితం

# శ్రీమతికి కోపమొచ్చింది

-- నవీన్

"నమస్కారమండి రచయిత గారూ!" అంటూ వచ్చాడు సత్యం. "హల్లో మిష్టర్ సత్యం! యేమంటూ పెళ్ళి చేసుకున్నావో కానీ అప్పట్నుంచి కనిపించటమే మానేశావు. కూర్చో!" అన్నాను చదువుతున్న పుస్తకాన్ని పక్కన పెట్టి.

"యేం పెళ్ళో యేమిటో సార్! పెళ్ళి చేసుకున్నప్పట్నించే నా ఇబ్బందులు స్టార్టయ్యాయి" అన్నాడు సత్యం నా ముందున్న సోఫాలో కూర్చుంటూ.

"అదేమిటి? నీ పెళ్ళయి ఆర్నెల్లు కూడా కాలేదు. అప్పుడే ఇబ్బందులంటున్నావు... అందుకేనేమో ఓ రచయిత అన్నాడు పెళ్ళిచేసుకోని వాళ్ళందరేమో ఎప్పుడు పెళ్ళి చేసుకుందామా అని ఉబలాటపడ్తారట. చేసుకున్నవాళ్ళేమో ఎందుకు చేసుకున్నామా అనీ విచారపడ్తుంటారట." అన్నాను.

"ఆ రచయిత ఎవరోగానీ చాలా బాగా చెప్పాడు సార్" అన్నాడు సత్యం.

"ఇంతకూ యేమిటి సమస్య?" అన్నాను.

సత్యం చాలాకాలంగా నా పుస్తకాలు చదువుతున్నాడు. నా రచనల్లో మనస్తత్వ పరిశీలన చాలా బావుంటుందని, అందుకే నా రచనలంటే తనకిష్టమని చెబుతుంటాడు. అప్పుడప్పుడు నా దగ్గరకొచ్చి సాహిత్యాన్ని గూర్చి తనకు తెలీని చాలా విషయాలు నన్నడిగి తెలుసుకునేవాడు. అలాగే తను ఎదుర్కొనే కొన్ని మానసిక సమస్యల్ని గూర్చి నాకు చెప్పేవాడు. ఈసారి కూడా అతడు నాతో అలాంటి సమస్యేదో చెప్పుకోవటానికే వచ్చాడని అర్థం చేసుకున్నాను.

"సమస్యేమిటంటే సార్! ఈ ఆడవాళ్ళకు ఎందుకు కోపమొస్తుందో తెలీదు. కోపమెందుకొచ్చిందో తెలిస్తే ఆ కోపాన్ని ఎలాగైనా పోగొట్టొచ్చు... కానీ....."

"మీఆవిడకు కోపమొచ్చిందా యేమిటి?"

"అవును సార్..... కోపమొచ్చింది. కానీ ఎందుకొచ్చిందో తెలీటం లేదు. మీరైతేనే ఆమె కోపానికి కారణమేమిటో చెప్పగల్గుతారని మీ దగ్గరకొచ్చాను" అన్నాడు సత్యం.

చాలా పెద్ద పరీక్షే పెట్టావే! సరె. ప్రయత్నిస్తాను. వివరాలు చెప్ప మరి. కోపం ఎప్పట్నించి? యే పరిస్థితుల్లో స్టార్టయింది."

"చెబుతాను సార్.... నా అర్థాంగి పేరు గీత. గీతను నేను ఎంతో యిష్టపడే చేసుకున్నాను. మా పెళ్ళయి ఇంకా ఆరు నెలలు దాటలేదు. ఈ ఆరునెలల్లో మేం రెండు నెలలు మాత్రమే కలిసున్నాము. ఎందుకంటె పెళ్ళయ్యాక నేనో మూడు నెలలు ట్రెయినింగ్‌కని బాంబే వెళ్ళాను. బాంబే నుండి వచ్చాకే మేం యిక్కడ కాపురం పెట్టాం. బాగానే వున్నాం. గీతలో లవ్‌బుల్ క్వాలిటీస్ చాలానే వున్నాయి. అకస్మాత్తుగా యేమయిందో తెలీదు. నాల్గురోజుల క్రితం మూతిముడిచేసింది. ఎంతకూ విప్పటం లేదు."

"నాల్గు రోజుల క్రితం యేం జరిగింది?"

"ఇద్దరం కలిసి మొదటిసారిగా సినిమాకెళ్ళాం సార్. సినిమాకు వెళ్తున్నప్పుడు చాలా మంచిమూడ్‌లోనే వుంది. తిరిగొచ్చేటప్పుడు మారిపోయింది. అప్పట్నించీ అసలు నాతో మాట్లాడటమే మానేసింది. తల బద్దలు కొట్టుకున్నా తన కోపానికి కారణమేమిటో చెప్పదు."

"సినిమా చూస్తోంటే యేమన్నా జరిగిందా?"


"యేమీ జరగలేదు సార్! ఇంటర్వెల్లో కూల్‌డ్రింక్సు తీసుకున్నాము. అంతకన్నా యింకేం జరగలేదు."

"సినిమా చూస్తోంటే నువ్వేమన్నా మాట్లాడావా?"

"మీరడిగారు కాబట్టి చెబుతున్నా. ఫ్రెండ్స్‌తో సినిమా చూస్తున్నప్పుడు నేను కొంచెం ఎక్కువగానే మాట్లాడుతుంటాను సార్. గీతతో కూడా అలానే మాట్లాడాను."

"యేం మాట్లాడావు?"

"సినిమా గురించే. సినిమాలో ముందు రాబోయే సీన్స్‌ను ముందే గెస్ చేసి చెప్పెయ్యటం నాకో అలవాటు. అలాగే సినిమాలో ఫ్లాష్‌బాక్ వచ్చిందనుకొండి నా



పక్కనున్నవాడు అది ఫ్లాష్‌బాక్ అని గుర్తించాడో లేదో అనుకొని 'ఫ్లాష్‌బాక్ స్టార్టయింది' అని చెబుతుంటాను. అలాగే కొందరు యాక్టర్స్‌ను నా ఫ్రెండ్స్ గుర్తించారో లేదోనని వాళ్ళు ఫలానా అని వాళ్ళ పేర్లు చెప్పేస్తూ వుంటాను. పాటల సీన్ రాగానే ఆ పాట నిజంగా పాడిన వాళ్ళ పేర్లు, పాటలను పిక్చరైజ్ చేస్తున్న లోకేషన్స్ పేర్లు చెప్పేస్తుంటాను."

"అంటే సినిమా మీద రన్నింగ్ కామెంటరీ చేసేస్తుంటావన్నమాట!"

"ఔను సార్. నాకున్న బాడ్ హాబిట్స్‌లో ఇదొకటి"

"మొన్నటి సినిమాలో కూడా అలాగే రన్నింగ్ కామెంటరీ చేశారా?"

"చేశాను సార్. ఇంకా ఎక్కువ ఉత్సాహంగా చేశాను. గీతకు ఆ సినిమాలో నటిస్తున్న హీరో హీరోయిన్ల పేర్లు కూడా చెప్పాను. ఫ్లాష్‌బాక్ అంటే యేమిటో చెప్పాను. అయినా ఇంతమాత్రానికే ఆమెకు అంత కోపం రావలా? ఆమెను ఉత్సాహపరచాలనే అలా చేశాను తప్ప."

"మీరు సినిమా చూస్తున్నప్పుడు మీ చుట్టుపక్కల కూర్చున్న వాళ్ళల్లో మీకు బాగా తెలిసిన వాళ్ళెవరైనా ఉన్నారేమో గమనించారా?"

"ప్రత్యేకంగా గమనించలేదుగాని ఇప్పుడు గుర్తొస్తోంది. మా యింటి పక్కనే వుండే ఓ ఇద్దరమ్మాయిలు సరిగ్గా మా వెనక సీట్లోనే కూర్చున్నారు. అయినా నేనసలు వాళ్ళను పట్టించుకోలేదు."

"నువ్వు పట్టించుకోలేదు. కానీ గీత పట్టించుకున్నది. తనకు సినిమా చూడటం తెలీదనుకొని నువ్వా రన్నింగ్ కామెంటరీ చేస్తున్నావని గీత భావించింది. అయినా గీత నిన్ను క్షమించేదే. కానీ తనకేమీ తెలీదనుకొని నువ్వా విషయాలన్నీ తనకు చెబుతున్నావని మీ వెనుక కూర్చున్న ఆ ఇద్దరాడపిల్లలు అనుకుంటున్నారని గీత గమనించింది. నువ్వు తనను వాళ్ళముందు ఇన్‌సెల్టు చేసినట్టుగా ఫీలయ్యింది. ఆమె కోపానికి అదీ కారణం."

"కరెక్టు సార్! ఇప్పుడర్థమైంది. రెండుసార్లు మా వెనుక కూర్చున్న ఆ ఇద్దరూ గట్టిగా నవ్వారు కూడా. ఇంత కరెక్ట్‌గా మీరెలా చెప్పగల్గారు సార్!"

"స్వానుభవం. నువ్వు చేసిన సరిగ్గా ఇలాంటి పొరపాటే నేనూ నీ వయస్సులో ఒకసారి చేశాను. ఆ పొరపాటును తెలుసుకోవటానికి నాకూ చాలా టైమ్ పట్టింది. ఆడవాళ్ళతో వచ్చిన ఇబ్బందేమిటంటే వాళ్ళెప్పుడు వాళ్ళకెందుకు కోపమొచ్చిందో చెప్పరు. మనమే తెలుసుకొని సర్దుకోవాలి. మరో విషయమేమిటంటే వాళ్ళనెప్పుడూ ఇంకొకరి ముందు మనం తక్కువ చేసినట్టుగా కనిపించకూడదు. పూర్వం మన పెద్దలు చెప్పారు. ఒక స్త్రీ బాధ పడేది మొగుడు కొట్టాడని కాదట... తోడికోడలు చూసిందని"

"థాంక్యూ సార్. థాంక్యూ. ఇప్పుడే వెళ్ళి గీతతో నేను చేసిన పొరపాటేమిటో తెలుసుకున్నానని, సారీ అని, అలాటి పొరపాటు మరోసారి జరగదని చెప్పేస్తాను" అన్నాడు సత్యం లేచి నిల్చొని.

"బెస్ట్ ఆఫ్ లక్!" అంటూ అతన్ని పంపించేశాను.

# "మా కాలేజీలో ఒకసారి"




## EYES

నేను కాలేజీలో చదివేరోజుల్లో మా తెలుగు మాస్టారు పాఠం చెబుతూ చెబుతూ 'కళ్ళు' గురించి లెక్చర్ ఇస్తున్నారు. క్లాస్ తెలుగు క్లాసే అయినా సరే మాస్టారు మాత్రం Eyes అంటూ మాట్లాడుతున్నారు. దూరం నుండి మా క్లాస్‌రూమ్‌లోకి వినబడుతోంది. ఐస్ అనే ఐస్‌వాలా కేక వెనుక బెంచీలో కూర్చున్న ఓ అబ్బాయి లేచి వచ్చింది ... మాస్టారూ! అన్నాడు. ఏమిటి? అడిగారు మాస్టారు. 'ఐస్' అన్నాడు. అంతలోనే ఐస్ వాలా అరుపులు మాస్టారు చెవులోనూ పడ్డాయి. ముందు మాస్టారు నవ్వి మమ్మల్ని నవ్వించేసారు. ఎప్పుడు ఐస్ అనే కేక వినబడినా మా మాస్టారే గుర్తొస్తారు. మిస్. మాధుర్‌శ్రీ

కొవ్వూర్

అవి నేను కాకినాడ పి.ఆర్ కాలేజీలో బి.కాం చదువుకునే రోజులు. ఓ రోజు యధా ప్రకారం నేను కాలేజీకి వెళ్ళి మొట్టమొదట లైబ్రరీ రూంకు వెళ్ళాను సాహిత్యానికి సంబంధించి ఒక పాత నవల తీసుకుని చదువుకుంటుండగా కాలేజీ క్యాంపస్‌లో పెద్ద కేకలు, హడావుడి కనిపించాయి. ఏమిటాని బయటకు వచ్చేసరికి బయట కాలేజీ



ప్రెసిడెంటు అతడి స్నేహితులు కలసి బజాజ్ చేతక్‌పై రౌండ్స్ కొడుతూ కేకలు వేస్తున్నారు. ఆ రోజు కాలేజీలో కొత్తగా ఒక లేడీ లెక్చరర్ వచ్చిందట. క్లాసులో వీరి అల్లరికి బయటకు పొమ్మందట. దానికి నిరసనగా వాళ్ళు అలా క్యాంపస్‌లో చక్కెర్లు కొడుతున్నారట.

ఆ ప్రెసిడెంట్ తదితరులు నాకు కాస్త తెలుసుండడంతో 'ఏమిటి బాసు' అంటు దగ్గరకెళ్ళాను. "నీకు తెలీదు బాసు" ..... చాలా అవమానం చేసింది. బయటకు పొమ్మంది. ఉక్రోషంగా అన్నాడతను. "భలేవాడివే నాతోరా" కనుక్కుందామంటూ అతడిని తీసుకొని ఆ కొత్త లెక్చరర్ దగ్గరకు తీసుకెళ్ళాను ..... మేడమ్ మా వాళ్ళను ఏదో అన్నారట. ఇంకెప్పుడూ అలా చేయరు? క్లాసులోనికి రానీయండి. అన్నాను. "సరే రండి" అన్నదామె. మావాడు నావైపు కోపంగా చూసి లోనికి నడిచాడు. నేను బయటకు వస్తుంటే 'మరి మీరు లోనికి రారా' అందామె. నేను నిత్యం క్లాసుపై స్ట్రైకేనండీ ... లైబ్రరీయే నా క్లాసు' అంటూ వచ్చేసాను. ఐతే కాలేజీకి ఎందుకు ఫీజు కట్టడం, లైబ్రరీకి ఫీజు కట్టండి' అందామె దాంతో అందరిలోనూ ఒకటే నవ్వు! ఇది జరిగిన అనంతరం ఆ మేడమ్ ఏ రోజు కనబడినా నేను చిన్న గిల్టీగానే ఫీలవుతాను!

కె.వి.మధుసూదనరావు

(కాకినాడ)